
బస్సు ఎదుట జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

## జర్నలిస్టులు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

### ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, మే 31 : జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్ జలవిహార్ జరిగిన టీజేఎఫ్(తెలంగాణ జర్నలిస్టుల ఫోరం) రజతోత్సవ సభకు తరలి వెళ్లిన టీయూడబ్ల్యూజే(హెచ్-143) యూనియన్ జర్నలిస్టుల బస్సును ఎమ్మెల్సీ రవీందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మద్దినేని గుట్టయ్య, శేఖర్, రామకృష్ణారెడ్డి, కరుణాకర్, రాజు, సీతారాం పాల్గొన్నారు.

## మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

మహబూబాబాద్ రూరల్, మే 31 : మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అధిక సంఖ్యలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.


హాస్టల్ ఎదుట నిలిచిన నీటిలో నిరసన తెలుపుతున్న నాయకులు

## హాస్టల్‌కు సీసీ రోడ్డు నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్, మే 31 : పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌కు వెళ్లడానికి సీసీ రోడ్డు నిర్మించాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సాయి కుమార్, సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రెండు రోజుల నుంచి వర్షాల వల్ల హాస్టల్ ఎదుట నీరు నిలవడంతో సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణంలో జంక్షన్ల పేరుతో రూ.కోట్లు వృథా చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. గతంలో సైతం అనేకసార్లు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు వేయలేదని ఆరోపించారు. వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తరుణ్, నరేశ్, వెంకటేశ్, గణేశ్, అజయ్, సునీల్ పాల్గొన్నారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సిరికొండ విక్రమ్

## తొర్రూరులో రక్తదానం శిబిరం

తొర్రూరు, మే 31 : మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తొర్రూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 40 మంది పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సిరికొండ విక్రమ్ రక్తదాతలను అభినందించి, సన్మాన పత్రాలు అందజేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## తెగిన ఓహెచ్ఈ వైర్.. నిలిచిన రైళ్లు

డోర్నకల్, మే 31 : గార్ల, డోర్నకల్ రైల్వేస్టేషన్ల మధ్య సీతారామ ప్రాజెక్టు కెనాల్ కాలువ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్‌తో ఐసోలేట్ రాడ్డు తగిలి ఓహెచ్ఈ (ఓవర్ హెడ్ ఎలక్ట్రిసిటీ లైన్ ) వైర్ శనివారం సాయంత్రం ట్రాక్ ఎగువ లైన్‌లో తెగిపోయింది. దీంతో డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో గంట పాటు కృష్ణ ఎక్స్‌ప్రెస్, సమీపంలో లక్నో ఎక్స్‌ప్రెస్ 40 నిమిషాలు పాటు నిలిపి వేశారు. రైల్వే అధికారులు యుద్ధప్రతిపాదన మరమ్మతు చేయడంతో రైళ్లు యథావిధిగా నడిచాయి. కాగా, రైలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## టీడబ్ల్యూజేఏ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవి నాయక్



మహబూబాబాద్ రూరల్, మే 31 : ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీడబ్ల్యూజేఏ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజావత్ రవి నాయక్ నియమితులయ్యారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన రాష్ట్ర మహాసభలో రవి నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయనకు జిల్లా జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

## వెదజల్లే సాగు లాభదాయకం

గంగారం మే 31 : వానకాలం సాగులో రైతు వరి పంటలో వెదజల్లే పద్ధతి పాటిస్తే ఖర్చు ఆదాతో పాటు దిగుబడి వస్తుందని, ఈ సాగుపై రైతులు దృష్టి చూపాలని కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక సెంటర్‌లో రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు కార్యక్రమం నిర్వహించగా రైతులకు మాలతి పలు సూచనలు ఇచ్చారు. విత్తనాల కొనేటప్పుడు రశీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. వెదజల్లే పద్ధతిలో ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో వేణువేదవ్, ఏఈవోలు కిశోర్, ధరనీశ్ పాల్గొన్నారు

## పచ్చి రొట్టె ఎరువులతో భూమి సారవంతం

నెల్లికుదురు, మే 31 : జనుము, జీనుగ వంటి పచ్చి రొట్టె ఎరువులతో భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని ఎర్రబెల్లిగూడెం క్లస్టర్ ఏఈవో చందన అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రబెల్లిగూడెం రైతువేదికలో శనివారం ప్రభుత్వ సబ్సిడీ జినుగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గి, దిగుబడి తగ్గిపోతుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు గాదె అశోక్, శ్రీను, ప్రశాంత్, భూక్యా రాజు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తన షాపుల్లో అధికారుల తనిఖీ

మరిపెడ, మే 31: మండల కేంద్రంలోని విత్తన షాపులను మరిపెడ ఏవో వీరాసింగ్, ఎస్సై సంతోష్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు. లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు లూజ్ విత్తనాలను తీసుకోవద్దని, డీలర్ల వద్ద బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్లను పంట చివరి వరకూ దాచుకోవాలని రైతులకు సూచించారు.

# పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం

మహబూబాబాద్ రూరల్, మే 31 : పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని, దీనివల్ల అనేక వ్యాధులు వస్తాయని డీఎంహెచ్‌వో రవి రాథోడ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేకత దినోత్సవం పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలో వైద్యులు, సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు వినియోగదారుల్లో సగం మందికి హృదయ సంబంధ, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాస కోశ, మధుమేహ వ్యాధులు వస్తున్నాయన్నారు. పొగాకు ఉత్పత్తులను వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధీర్‌రెడ్డి, నాగేశ్, సారంగం, విజయ్ కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు. అలాగే, పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా జిల్లా కోర్టులో నిర్వహించిన సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ పాల్గొని న్యాయశాఖ ఉద్యోగులతో పొగాకు ఉత్పత్తులను ఎట్టి పరిస్థితులోనూ వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



తొర్రూరు : మాట్లాడుతున్న దవాఖాన సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజు

**పొగాకు రహిత సమాజం నిర్మించాలి**

తొర్రూరు : పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలని తొర్రూరు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పగిటిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని దవాఖానలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకు వల్ల వినియోగదారుడికే కాకుండా పక్కనున్నవారికి కూడా హాని జరుగుతుందన్నారు. పొగాకు దుష్ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, మానస, నందన, ఆయుర్వేద వైద్యుడు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# యమపాశమైన విద్యుత్ తీగలు

- బైక్‌పై వస్తుండగా మెడకు తాకి ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- రోడ్డుపై వేలాడుతున్నా పట్టించుకోని అధికారులు

తొర్రూరు, మే 31 : రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ తీగలు యమపాశమయ్యాయి. అవి మెడకు తగలడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఒకరు దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని చర్లపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం చిన్న వంగార గ్రామానికి చెందిన వల్లపు అశోక్ (45), యాసారపు మల్లయ్య(50) పెద్దవంగర నుంచి పెద్దముప్పారం గ్రామానికి గొర్రెల వ్యాపార నిమిత్తం బైక్‌పై వెళుతున్నారు. చర్లపాలెం ఐకేపీ సెంటర్ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వపై విద్యుత్ తీగలు వేలాడుతుండగా గమనించకుండా వెళ్లడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంలో వారిని తొర్రూరులోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతిచెందాడు. మల్లయ్య పరిస్థితి కూడా విషమంగా ఉంది. అశోక్ తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శుక్రవారం రాత్రి హరిపిరాలకు చెందిన సివిల్ సప్లయ్ లారీ ఎస్సారెస్పీ కాల్వ మీదుగా వెళ్లే సమయంలో తగలడంతో తీగలు కిందకు వేలాడినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన విద్యుత్ శాఖ, సివిల్ సప్లయ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

## పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి

గార్ల, మే 31 : రాంపురం పాకాల ఏటిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శనివారం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ వినతి పత్రం అందజేశారు. గార్ల మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మాలోత్ వెంకట్ లాల్, బట్టు నాగరాజు, శ్రీలంశెట్టి ప్రవీణ్, భూక్యా నాగేశ్వరావు, అజ్మీరా బన్సీలాల్, రామారావు పాల్గొన్నారు.


చోరీ జరిగిన ధాన్యం రాశిని చూపిస్తున్న యాకయ్య, చంద్రయ్య

## ధాన్యం దొంగతనం కలకలం

### కొనుగోలు కేంద్రంలో వరుసగా చోరీలు

నర్సింహులపేట, మే 31 : మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో రెండు రోజులుగా ధాన్యం దొంగతనం కలకలం రేపుతోంది. మండలంలోని జయపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కౌలు రైతు మందుల యాకయ్య, మందుల చంద్రయ్య కొనుగోలు కేంద్రంలో వడ్లు అమ్ముకునేందుకు తీసుకొచ్చిన ధాన్యం రాశుల్లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఏడు క్వింటాళ్లు అపహరించారు. ఈ కొనుగోలు కేంద్రం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్నా ఇలా రెండు రోజులుగా దొంగతనం జరుగడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు బాధిత ధాన్యం అపహరణపై తహసీల్దార్ రమేశ్‌బాబు, ఏవో వినయ్‌కుమార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుసగా రెండు రోజులు దొంగతనం జరగడంపై కొనుగోలు కేంద్రం సిబ్బందిని ప్రశ్నించగా 'మీ ధాన్యానికి మీరే బాధ్యులు.. మాకేం సంబంధం' అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని యాకయ్య తెలిపారు.

## మామిడి తోట ఫెన్సింగ్ ధ్వంసం

కురవి, మే 31 : మామిడి తోటకు వేసిన ఫెన్సింగ్‌ను కొంత మంది వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసినట్లు సీరోలు మండలం రేకుల తండా జీపీ పరిధి రూప్లానాయక్ తండాకు చెందిన బానోత్ నరేంద్రకుమార్ శనివారం మరిపెడ సీఐకి ఫిర్యాదు చేశారు. రూప్లా నాయక్ తండాలో తన తండ్రి 40 ఏళ్ల క్రితం మామిడితోటకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడని, అయితే, తండాకు చెందిన కొంత మంది దాన్ని ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని నరేంద్ర కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై సీరోలు ఎస్సై నగేశ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## విద్యుదాఘాతంతో రెండు బర్రెలు, ఆవు మృతి

డోర్నకల్, మే 31 : విద్యుదాఘాతంతో రెండు బర్రెలు, ఒక ఆవు మృతి చెందిన ఘటన ఫకీరా తండా పరిధిలో శనివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. చిల్కోడుకు చెందిన మిరియాల నరేశ్, బండ్ల జంపయ్య రెండు గేదెలు, బోడియా తండాకు చెందిన బానోత్ శంకర్ ఆవు పశుగ్రాసం కోసం తుర్కా వెంకన్న వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాయి. అక్కడ గాలివానతో తెగిపడిన విద్యుత్ తీగలకు తాకి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెలు, ఆవు విలువ సుమారుగా రూ. 1.50లక్షలు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

## అవకతవకలపై విచారణ చేపట్టాలి

గార్ల, మే 31 : మద్దివంచ గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు ఎంపీడీవో మంగమ్మ దృష్టికి తీసుకెళ్లారు. పని చేయని వారి అకౌంట్‌లో నగదు జమ చేసినట్లు తెలిపారు. సుమారు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

## కాల్వను మూసి వేయాలి

డోర్నకల్, మే 31 : డోర్నకల్ గాంధీ సెంటర్‌లో అమృత్ జల్ 2.0 కోసం తీసిన కాలువను మూసివేయాలని స్థానికులు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. 15 రోజులు గడిచినా పైపులైను కాల్వ మూసి వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అమృత్ జల్ 2.0 కోసం తవ్విన కాలువ మూసివేయాలని కోరారు.

## జిలెటిన్ స్టిక్స్, కంప్రెషర్ ట్రాక్టర్ సీజ్

నర్సింహులపేట, మే 31 : మండలంలోని పడమటి గూడెం శివారులో శనివారం నిషేధిత జిలెటిన్ స్టిక్స్‌ను పట్టుకున్నట్లు ఎస్సై మాలోత్ సురేశ్ తెలిపారు. గ్రామంలోని పంట పొలాల్లో బండ రాళ్లు పగుల గొట్టేందుకు ఉపయోగించే జిలిటన్ స్టిక్స్‌తో పాటు కంప్రెషర్ ట్రాక్టర్‌ను పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## వీధిలైట్ల ఏర్పాటు

నర్సింహులపేట, మే 31 : మండలంలోని కొమ్ములవంచ జీపీ పరిధి దుబ్బతండాలో కొన్ని నెలలుగా వీధిలైట్లు లేక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు స్పందించిన తండాకు చెందిన ఉద్యోగి జాటోత్ రామారావు రూ.50వేలతో 20 విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో రామారావుకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## 2.94 గ్రాముల గంజాయి స్వాధీనం

### ఒకరి అరెస్టు, ఇద్దరు పరార్

మహబూబాబాద్ రూరల్, మే 31 : పట్టణంలో 2.94 గ్రాముల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ ఏరియాలో ఎస్సై విజయ్ కుమార్ వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఓ స్కూటీపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి స్కూటీ వదిలి పారిపోతుండగా ఎం కృష్ణ అనే వ్యక్తిని పట్టుకున్నారు. స్కూటీ తనిఖీ చేయగా అందులో 2.94 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. దీంతో కృష్ణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలి

గార్ల, మే 31 : రైతుల సమస్యలు పరిష్కారించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులకు వానకాలం పంట సీజన్ ముందే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. నాయకులు సక్రు, మాన్య, మల్లేశ్, మాధవరావు పాల్గొన్నారు.

# ఆధార్ సెంటర్ వద్ద ప్రజల అవస్థలు

డోర్నకల్, మే 31 : డోర్నకల్‌లోని పోస్టు ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ వద్ద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు, కొత్త కార్డు నమోదు కోసం క్యూలో నిలబడుతున్నారు. గార్ల మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఆయా పరిసర ప్రాంతాలు ప్రజలు కూడా ఆధార్ కార్డు నమోదు కోసం ఇక్కడికే వస్తున్నారు. దీంతో సకాలంలో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా డోర్నకల్‌లో అదనంగా మరో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


డోర్నకల్‌లోని ఆధార్ సెంటర్ వద్ద ఉన్న ప్రజలు

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

తొర్రూరు, మే 31 : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన మూల శ్రీనివాస్(45) కొంతకాలం క్రితం తలకు గాయం కావడంతో పని చేయలేని స్థితికి చేరుకున్నాడు. భార్యా ఇద్దరు ఆడపిల్లలు ఉన్న అతడికి కుటుంబ బాధ్యతలు భుజాలపై ఉండడం, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై శ్రీనివాస్ భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి


రవి(ఫైల్)

కురవి, మే 31: చికిత్స పొందుతూ ఒకరు శనివారం మృతి చెందారు. ఈ నెల 21న కురవి శివారులో బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో కురవికి చెందిన కత్తి రవి(50)కి తీవ్రగాయాలయ్యాయి. వివిధ దవాఖానల్లో చికిత్స అనంతరం ఖమ్మంలోని దవాఖానలో చేరాడు. అక్కడే శనివారం మృతి చెందినట్లు పీఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, మృతుడికి భార్య ఉమ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## అనారోగ్యంతో వృద్ధురాలు..

తొరూరు, మే 31 : అనారోగ్యంతో బాధపడుతూ ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపురానికి చెందిన మద్దెల కొమురమ్మ(85)కు కొడుకు రామ్మూర్తి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొడుకు అవుతాపురం గ్రామంలో ఉంటున్నాడు. కొమురమ్మ గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. అయితే, శనివారం తల్లి వద్దకు కొడుకు తిరుపతి ప్రసాదం తీసుకుని వచ్చాడు. అయితే, ఇంట్లో తల్లి అప్పటికే మృతి చెంది కనిపించింది. ఆమె చనిపోయి నాలుగు రోజులై ఉంటుందని స్థానికులు తెలిపారు. అయితే, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## పురుగు మందు తాగిన మహిళ

### దవాఖానకు తరలించిన పోలీసులు

నర్సింహులపేట, మే 31 : సమస్యను పరిష్కరించడం లేదని ఓ మహిళ పురుగు మందు తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండలంలోని పిచ్చిరాంతండాకు చెందిన భూక్యా వినోదకు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా, భార్యభర్తల మధ్య తగాదాను పోలీసులు పరిష్కరించడం లేదని శుక్రవారం ఎమ్మెల్యే రామచంద్రూనాయక్ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించింది. అయితే, అప్పుడు పోలీసులు అడ్డుకున్నారు. కాగా, సమస్య పరిష్కరించాలని శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆమె పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. దీంతో ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.


అంత్యక్రియల్లో కుండపట్టిన కుమార్తె సమంత

## తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

కురవి, మే 31 : తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన ఘటన శనివారం కురవి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏపీలోని నంద్యాల జిల్లా కోవెలకుంట్ల సమీపంలో జరిగిన ప్రమాదంలో కురవికి చెందిన దుస్స రాంబాబు (40) ఈ నెల 29న మృతి చెందాడు. ఈ మేరకు రాంబాబు మృతదేహం శుక్రవారం రాత్రి కురవికి చేరుకోగా అంత్యక్రియలు శనివారం జరిగాయి. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సమంత తలకొరివి పెట్టింది.

## ద్విచక్ర వాహనం చోరీ

డోర్నకల్, మే 31 : ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన డోర్నకల్‌లో శనివారం చోటు చేసుకుంది. ఇందిర నగర్‌కు చెందిన ఆవదూర్తి మనోజ్ ఏప్రిల్ 7న రైల్వే స్టేషన్ వద్ద బైక్ పార్కు చేశాడు. అయితే, గుర్తు తెలియని వ్యక్తి దాన్ని చోరీ చేశాడు. బాధితుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

## కేటీఆర్‌ను కలిసిన ఉదయ్‌కిరణ్


కేటీఆర్‌తో ఉదయ్‌కిరణ్

కేసముద్రం , మే 31 : మండల కేంద్రానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి గునిగంటి ఉదయ్ కిరణ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్‌ను ఇంగ్లాండ్‌లో కలిశారు. ఉదయ్‌కిరణ్ ఇంగ్లాండ్‌లోని కోవెంట్రీ యునివర్సిటీలో ఎంఎస్ చదువుతున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన కేటీఆర్‌ను ఉదయ్‌కిరణ్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత తెలంగాణకు వచ్చి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు ఉదయ్‌కిరణ్ తెలిపారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దంతాలపల్లి, మే 31 : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు పోకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. చిన్నచిన్న తప్పిదాలు చేసి జీవితాలను జైలు పాలు చేసుకోవద్దన్నారు. అనంతరం ప్రపంచ పోగాకు నివారణ దినోత్సవం సందర్భంగా దూమపానం, మద్యపానానికి ప్రజలు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు

## మాజీ మంత్రికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ


సత్యవతిరాథోడ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

కురవి, మే 31 : మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకోగా కురవి, సీరోలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి పరామర్శించారు. ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ సర్పంచ్‌లు బోడ శ్రీను, బానోత్ వీరన్న, గుగులోత్ వనజ శ్రీరాంనాయక్, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు అల్లూరి కిశోర్‌వర్మ, గుగులోత్ నెహ్రూ నాయక్, ఐలి నరహరిగౌడ్, కల్లెపు శ్రీనివాస్, బానోత్ బద్రునాయక్, జంగం రవి ఉన్నారు.

## సేవల జాబితా బోర్డులు ప్రదర్శించాలి

నెల్లికుదురు, మే 31 : మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో సేవల జాబితా బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని తహసీల్దార్ సీహెచ్ నరేశ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ పనులకై సేవా కేంద్రాలకు వచ్చిన వారితో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేదకు పీఎస్సై చేయూత


సరుకులు అందచేస్తున్న పీఎస్సై కృష్ణారెడ్డి

కురవి, మే 31 : మండల కేంద్రం శివారు తులిస్యా తండా పరిధి భద్రు తండాలో నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, నగదును శనివారం కురవి పీఎస్సై జీవీ కృష్ణారెడ్డి అందజేశారు. తండాకు చెందిన మూడు రమేశ్ తల్లి ఇటీవల కురవి గుడి సమీపంలో మృతి చెందగా, గతంలోనే తండ్రి చనిపోయాడు. నిలువ నీడలేని రమేశ్ కుటుంబానికి సాయం అందించాలనే లక్ష్యంతో పీఎస్సై కృష్ణారెడ్డి వాటిని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మూడు అరుణ శ్రీనివాస్, కానిస్టేబుల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

**PLOT FOR SALE**



★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347.
NTW-337079

★ మడికొండ to రాంపూర్ HYD హైవే కపిల్‌పుడ్స్ ఎదురుగా 1210 గజాల రిజిష్టర్డ్ మరియు నాలా కన్వర్షేషన్ గల ప్లాటు అమ్మబడును. సంప్ర: 9346434041.
NTW-4105

**కిరాయికి ఇవ్వబడును**

★ వరంగల్ శివనగర్ (పద్మశాలి కళ్యాణ మండపం దగ్గర 2 పోర్షన్ (2 బెడ్ రూమ్‌లు+కిచెన్+హా) ఇల్లు కిరాయికి ఇవ్వబడును. విశాలమైన ప్లేస్ కూడా కలిగి ఉన్నది. సంప్ర: సెల్: 9492180497.
NTW-000

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

**WATER PROOFING**

★శ్రీ వెంకటేశ్వర వాటర్ ప్రూఫింగ్: వాటర్ లీకేజీ టెక్నిషియన్ నిర్ధారించి చేయబడును. ఓల్డ్ & న్యూ బిల్డింగ్ సొల్యూషన్స్- SS కన్స్ట్రక్షన్స్, Wgl.ప్రో, శ్రీకాంత్ 9014012652.
NTW-336940

**WANTED**

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**FINANCE**

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565